వెంటాడిన ఫెడ్ భయాలు

- భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు
- ఆల్‌టైమ్ హై నుంచి సూచీలు పతనం
- సెన్సెక్స్ 793, నిఫ్టీ 234 పాయింట్లు డౌన్
- ఒక్కరోజే రూ.2.52 లక్షల కోట్ల సంపద ఆవిరి

ముంబై, ఏప్రిల్ 12: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ నష్టాలను చవిచూశాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం గణాంకాలు పెరగడంతో రాబోయే ద్రవ్యసమీక్షల్లో ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల తగ్గింపును పక్కకు పెట్టవచ్చన్న అంచనాల మధ్య మదుపరులు లాభాల స్వీకరణకు దిగారు. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 793.25 పాయింట్లు లేదా 1.06 శాతం దిగజారి 74,244.90 వద్దకు పడిపోయింది. ఒకానొక దశలో 848.84 పాయింట్లు కోల్పోవడం గమనార్హం. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ కూడా 234.40 పాయింట్లు లేదా 1.03 శాతం క్షీణించి 22,519.40 వద్ద నిలిచింది. అంతకుముందు సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉన్న విషయం తెలిసిందే. కాగా, ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు లేకపోతే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కూడా వడ్డీ కోతలకు ఇప్పట్లో వెళ్లబోదని నిపుణులు చెప్తున్నారు. ఇదే జరిగితే రియల్టీతోపాటు, స్టీల్, ఆటో, బ్యాంకింగ్ తదితర కీలక రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యే వీలుందని మెజారిటీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రంగాలవారీగా..

చమురు-గ్యాస్, యుటిలిటీస్, రియల్టీ, బ్యాంకింగ్, కమోడిటీస్, ఐటీ, ఆర్థిక సేవల రంగాల షేర్లు గరిష్ఠంగా 1.28 శాతం వరకు నష్టపోయాయి. సన్ ఫార్మా, మారుతీ, పవర్ గ్రిడ్, టైటాన్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టెక్ మహీంద్రా, ఎల్‌అండ్‌టీ, ఎస్బీఐ షేర్లు నిరాశపర్చాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలూ 0.49 శాతం, 0.60 శాతం చొప్పున పడిపోయాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్ల విషయానికొస్తే.. ప్రధాన ఆసియా మార్కెట్లలో జపాన్ ఒక్కటే లాభపడింది. దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్ సూచీలు నష్టపోయాయి.

రూ.400 లక్షల కోట్ల దిగువకు..

భారీ నష్టాలు బీఎస్ఈలోని కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్‌ను రూ.400 లక్షల కోట్ల కిందికి దిగజార్చాయి. ఒక్కరోజే బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.2.52 లక్షల కోట్లు హరించుకుపోయింది. దీంతో రూ.3,99,67,051.91 కోట్లకు పరిమితమైంది. బుధవారం ముగింపుతో చూస్తే శుక్రవారం రూ.2,52,301.16 కోట్లు పడిపోయింది. అంతకుముందు మార్కెట్ విలువ ఆల్‌టైమ్ హైలో ఉన్న సంగతి విదితమే.

తులం 73,350

మరో ఆల్‌టైమ్ హైకి బంగారం ధర

జెట్ స్పీడ్‌తో పెరుగుతూపోతున్న రేట్లు

ఒక్కరోజే రూ.1,050 పైకి

కిలో వెండి రూ.86,300



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: పసిడి ధరలు పట్టపగ్గాల్లేకుండా పరుగులు పెడుతున్నాయి. రోజుకో రికార్డును సృష్టిస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. వరుసగా నాల్గో రోజూ మునుపెన్నడూలేని మరో స్థాయికి చేరుకున్నాయి. ఈ క్రమంలోనే శుక్రవారం కనీవినీ ఎరుగని రీతిలో తులం 24 క్యారెట్ బంగారం ధర రూ.73,000 మార్కును దాటింది. బులియన్ మార్కెట్‌లో తొలిసారి 10 గ్రాములు రూ.73,350 పలికింది. క్రితం రోజుతో పోల్చితే ఒక్కరోజే రూ.1,050 ఎగబాకడం గమనార్హం.

స్పాట్ మార్కెట్‌లో రూ.75వేలకు..

ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో స్థానిక పన్నులతో కలిపితే తులం పుత్తడి రూ.75వేలపైకే చేరింది. శుక్రవారం ఒకానొక దశలో 10 గ్రాములు రూ.75,500గా నమోదైనట్టు మార్కెట్ వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాములు రూ.1,090 ఎగిసి రూ.73,310గా ఉన్నది. 22 క్యారెట్ రూ.1,000 పుంజుకొని రూ.67,200కు చేరింది. అయితే స్పాట్ మార్కెట్‌లో 24 క్యారెట్ రూ.75,450కిపైగా పలికింది. ఇక ఫ్యూచర్ మార్కెట్లలోనూ పసిడి కాంతులు విరజిమ్ముతున్నాయి.

వెండి ధరలూ రయ్.. రయ్

వెండి ధరలూ దౌడు తీస్తున్నాయి. కిలో వెండి ధర రూ.86,300కు చేరింది. ఢిల్లీలో ఒక్కరోజే రూ.1,400 పెరిగింది. ఇక హైదరాబాద్‌లో రూ.1,500 ఎగిసి రూ.86,500ను తాకింది. సాధారణ కొనుగోలుదారులతో పాటు పారిశ్రామిక వర్గాల నుంచి పెరిగిన డిమాండే ధరల పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇదిలా వుంటే గ్లోబల్ మార్కెట్‌లో ఔన్సు పుత్తడి 48 డాలర్లు పెరిగి 2,388 డాలర్లను చేరింది. వెండి కూడా ఔన్సు 28.95 డాలర్లకు వెళ్లింది.

ధరలు పెరిగితే ఇబ్బందే..

మార్కెట్‌లో బంగారం ధరలు ఇలా పెరుగుతూపోతే.. వ్యాపారం సాగదని జ్యుయెల్లర్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్‌తో అమ్మకాలు మందగించాయని ప్రముఖ ఆభరణాల వర్తక సంస్థ సెన్కో గోల్డ్ లిమిటెడ్ అంటున్నది. డిమాండ్ పడిపోయిందని కోల్‌కత్తాకు చెందిన ఈ కంపెనీ పేర్కొంటున్నది. 'గడిచిన 30 రోజుల్లో బంగారం ధరలు దాదాపు 10 శాతం ఎగబాకాయి. ఇక గత 6 నెలల్లో 23-25 శాతం పుంజుకున్నాయి. దీని వల్ల రిటైల్ మార్కెట్ సెంటిమెంట్ దెబ్బతిన్నది. ఇండస్ట్రీ వాల్యూమ్స్ 15-20 శాతం దిగజారాయి' అని సెన్కో గోల్డ్ ఎండీ, సీఈవో సువంకర్ సేన్ అన్నారు. అయితే స్థానిక పండుగలతో మార్కెట్ కొంత పుంజుకోవచ్చన్న ఆశాభావం ఉన్నప్పటికీ.. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా నగదుపై ఉన్న ఆంక్షలు తమ అమ్మకాలను ప్రభావితం చేయవచ్చన్న అనుమానాలనూ వ్యక్తం చేశారు. మొత్తానికి ధరలు స్థిరంగా ఉంటేనే అమ్మకాలు బాగా జరుగుతాయని మెజారిటీ రిటైలర్లు చెప్తుండటం గమనార్హం.

విపణిలో పసిడి ధరల పెరుగుదలకు కారణాలు

- అంతర్జాతీయ మార్కెట్‌లో పరుగులు పెడుతున్న రేట్లు
- ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల కోతలు ఆలస్యమవుతాయన్న అంచనాలు
- దేశీయ స్టాక్ మార్కెట్ల ఒడుదొడుకులు
- మదుపరుల దృష్టిలో సురక్షిత పెట్టుబడి సాధనం
- పెండ్లిళ్ల సీజన్‌తో పెరిగిన డిమాండ్

పావు గంటలో చార్జింగ్

మార్కెట్‌లోకి ఒమెగా ఎలక్ట్రిక్ ఆటో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ) తయారీదారు ఒమెగా సీకీ మొబిలిటీ (ఓఎస్ఎం).. శుక్రవారం దేశీయ మార్కెట్‌లోకి 'స్ట్రీమ్ సిటీ కిక్' పేరుతో ఓ నయా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ త్రీవీలర్‌ను తీసుకొచ్చింది. కేవలం 15 నిమిషాల్లోనే చార్జింగ్ అవడం దీని ప్రత్యేకత. దీంతో ఆటో డ్రైవర్లకు ఇది ఎంతో లాభదాయకమని కంపెనీ వ్యవస్థాపక చైర్మన్ ఉదయ్ నారంగ్ చెప్తున్నారు. కాగా, దీని ఎక్స్‌షోరూం ధర రూ.3,24,999. కొనుగోలుదారులకు 2 లక్షల కిలోమీటర్లు లేదా 5 ఏండ్ల వారంటీ లభిస్తుంది. ఇందులో 8.8 కిలోవాట్స్ బ్యాటరీ ఉన్నది. ఇది లావుంటే ఈ ఏడాది ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరుల్లో 100 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్న సంస్థ.. ఆ తర్వాత హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్, కోల్‌కతాల్లోనూ తేనున్నది.

నెమ్మదించిన పారిశ్రామికం

ఫిబ్రవరిలో 5.7 శాతంగా నమోదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: పారిశ్రామిక రంగం మళ్లీ పడకేసింది. ఫిబ్రవరి నెలకుగాను పారిశ్రామిక రంగంలో వృద్ధి 5.7 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 6 శాతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గినట్లు జాతీయ గణాంకాల శాఖ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. తయారీ రంగంలో వృద్ధి 5.9 శాతం నుంచి 5 శాతానికి తగ్గడం వల్లనే వృద్ధి నెమ్మదించిందని తెలిపింది. అలాగే గనులు ఉత్పత్తిలో 8 శాతం వృద్ధిని నమోదు చేసుకోగా, పవర్ 7.5 శాతానికి పరిమితమైంది.

ఐదు నెలల కనిష్ఠానికి రిటైల్ ద్రవ్యోల్బణం

గత కొన్ని నెలలుగా పెరుగుతూ వచ్చిన ధరల సూచీ ఎట్టకేలకు శాంతించింది. ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పట్టడంతో గత నెలకుగాను రిటైల్ ద్రవ్యోల్బణ సూచీ ఐదు నెలల కనిష్ఠానికి తాకుతూ 4.85 శాతానికి దిగొచ్చింది. ఫిబ్రవరి నెలలో 5.09 శాతంగా ఉన్న ధరల సూచీ..ఏడాది క్రితం ఇదే నెలలో 5.66 శాతంగా నమోదైంది. అక్టోబర్ 2023లో నమోదైన 4.87 శాతం తర్వాత ఇదే కనిష్ఠం. ఆహారానికి సంబంధించిన ధరల సూచీ 8.66 శాతం నుంచి 8.52 శాతానికి తగ్గింది.

టీసీఎస్‌లో తగ్గిన ఉద్యోగాలు

- గత 19 ఏండ్లలో ఇదే తొలిసారి
- క్యూ4లో 12,434 కోట్ల లాభం

ముంబై, ఏప్రిల్ 12: దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికి గాను సంస్థ రూ.12,434 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.11,392 కోట్లతో పోలిస్తే ఇది 9.1 శాతం అధికం. మార్జిన్లు అధికమవడం, దేశీయ వ్యాపారం మరింత బలోపేతం కావడం వల్లనే లాభాల్లో వృద్ధి నమోదైందని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 3.5 శాతం పెరిగి రూ.61,237 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది.

- 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తానికి నికర లాభం 9 శాతం ఎగబాకి రూ.45,908 కోట్లకు చేరుకున్నది. అలాగే ఆదాయం రూ.2,25,458 కోట్ల నుంచి రూ.2,40,893 కోట్లకు ఎగబాకింది.
- సంస్థ ఆపరేటింగ్ మార్జిన్ 1.50 శాతం అధికమై 26 శాతానికి చేరుకున్నది.
- గతేడాది చివరి త్రైమాసికంలో సంస్థ 13.2 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకున్నది. ఒక త్రైమాసికంలో ఇంతటి స్థాయిలో ఆర్డర్లు రావడం ఇదే తొలిసారి.
- 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రతిషేరుకు రూ.28 డివిడెండ్‌ను ప్రకటించింది.
- గతేడాది మెరుగైన పనితీరు కనబరిచిన ఉద్యోగుల వేతనాలు రెండంకెలు పెంచనున్నట్లు తెలిపింది.
- మూడో త్రైమాసికంలో 13.3 శాతంగా ఉన్న వలసల రేటు 12.5 శాతంగా నమోదైంది.
- ఉత్తర అమెరికా నుంచి వచ్చిన ఆదాయంలో 2.3 శాతం తరుగుదల నమోదైంది.
- గత త్రైమాసికంలో కంపెనీ ఉద్యోగుల సంఖ్య 2 వేలు తగ్గారు. దీంతో మొత్తం సంఖ్య 6,01,546కి తగ్గినట్లు అయింది. గత 19 ఏండ్లలో ఇలా తగ్గడం ఇదే తొలిసారి.

మార్జిన్లు అధికమవడం, భారీ స్థాయిలో ఆర్డర్లు రావడం వల్లనే లాభాల్లో భారీ వృద్ధి నమోదైంది. అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ కస్టమర్లతో అనుసంధానం కలిగివుండటం వల్ల ఇది సాధ్యమైంది. బీఎస్ఎన్ఎల్ నుంచి రూ.15 వేల కోట్ల విలువైన ఆర్డర్ రావడంతో దేశీయ వ్యాపారంలో 38 శాతం వృద్ధి నమోదైంది. ఇది మొత్తం వృద్ధిలో 5 శాతం నుంచి 6.7 శాతానికి చేరుకున్నది.

- కే కృతివాసన్,
టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్, ఎండీ

15 కోట్లకు దేశీయ విమాన ప్రయాణికులు

2023-24లో చేరుకునే అవకాశం: ఇక్రా

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: దేశీయ విమాన ప్రయాణికులు అంతకంతకు పెరుగుతున్నారు. వార్షిక వృద్ధి 13 శాతంతో గడిచిన ఆర్థిక సంవత్సరం చివరినాటికి 15.4 కోట్లకు చేరుకోనున్నారని క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. అలాగే దేశీయ విమాన యాన సంస్థల నష్టాలు కూడా రూ.3-4 వేల కోట్లకు తగ్గొచ్చని వెల్లడించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కరోనా కంటే ముందు స్థాయికి విమాన ప్రయాణికులు చేరుకోనున్నారని, 2019-20లో 14.2 కోట్ల మంది ప్రయాణించారని తెలిపింది.

- ప్రస్తుతం ఏఐఎక్స్ కనెక్ట్, ఎయిర్ ఇండియా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్(ఇండిగో), టాటా సింగపూర్ ఎయిర్‌లైన్స్, స్పైస్‌జెట్ సంస్థలు దేశీయంగా విమాన సేవలు అందిస్తున్నాయి.
- కేవలం గత నెలలోనే విమానయాన సంస్థల కెపాసిటీ 2 శాతం పెరిగింది.
- ఫిబ్రవరితో ముగిసిన 11 నెలల కాలంలో అంతర్జాతీయ ప్రయాణికులు 25 శాతం ఎగబాకి 270.1 లక్షలకు చేరుకున్నారు. కరోనా సమయంలో నమోదైన 218.1 లక్షల కంటే అత్యధికం.

మలబార్ గోల్డ్ 100 షోరూంలు

బెంగళూరు, ఏప్రిల్ 12: మలబార్ గోల్డ్.. తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరించబోతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 100 నూతన స్టోర్లను తెరవనున్నట్లు మలబార్ గ్రూపు చైర్మన్ ఎంజీ అహ్మద్ తెలిపారు. దీంట్లోభాగంగానే న్యూజిలాండ్, ఈజిప్ట్, బంగ్లాదేశ్‌లో ప్రవేశించడంతోపాటు యూరప్, అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాల్లో మరిన్ని స్టోర్లను తెరవబోతున్నట్లు ఆయన ప్రకటించారు. అలాగే జార్ఖండ్, గోవా, అసోం, త్రిపుర, జమ్ము అండ్ కశ్మీర్‌లో మరిన్ని స్టోర్లను ప్రారంభించాలనుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకోసం కొత్తగా 7 వేల మంది సిబ్బందిని నియమించుకోనుండటంతో మొత్తం సంఖ్య 21 వేల నుంచి 28 వేలకు చేరుకోనున్నారు. మరోవైపు, సంస్థ గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.51,218 కోట్ల వార్షిక టర్నోవర్‌ను సాధించింది.

చిత్రం

అమ్మకోసం ఆలయం

తమిళ అగ్ర హీరో విజయ్ వాళ్ల అమ్మకోసం ఆలయం కట్టారు. ఈ విషయం తమిళనాడు మీడియాలో బాగా వైరల్ అయ్యింది. దీనిపై విజయ్ తల్లి శోభ తాజాగా స్పందించారు. 'అవును.. నా కొడుకు విజయ్ నాకోసం గుడికట్టాడు. నేను సాయి భక్తురాలిని. నాకెప్పట్నుంచో సాయిబాబా గుడి కట్టాలనే కోరిక ఉండేది. వాడితో చాలాసార్లు ఆ విషయం చెప్పాను కూడా. నా కోరికను అర్థం చేసుకుని ఇన్నాళ్లకు నాకోసం సాయిబాబా ఆలయం కట్టాడు. నా కొడుకు నాకోసం కట్టిన ఈ సాయి ఆలయానికి వచ్చి బాబాను దర్శించుకుంటే నాకేదో తెలియని ఆనందం.. మనశ్శాంతి. ఈ దేవాలయంలో నిత్యాన్నదానం జరిపించాలని ఆలయ కమిటీ నిశ్చయించింది. దానికి కూడా తగిన సహకారం అందిస్తాం' అని తెలిపారు విజయ్ తల్లి శోభ. తల్లి కోరిక మేరకు విజయ్ ఆలయం కట్టడంపై పలువురు హర్షం వెలిబుచ్చుతున్నారు.

వారికి థాంక్స్ చెప్పాలి!

కెరీర్ తొలినాళ్లలో ఎదుర్కొన్న ఎన్నో తిరస్కారాలు తనలో పట్టుదలను పెంచాయని, వాటన్నింటినీ ఛాలెంజ్‌గా తీసుకొని పనిచేయడం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని చెప్పింది కథానాయిక మృణాల్ ఠాకూర్. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ భామ ఇండస్ట్రీలో తన తొలినాటి రోజుల్ని గుర్తుచేసుకుంది. 'ఆడిషన్స్‌కు వెళ్లిన చాలా సందర్భాల్లో నేను నటనకు పనికిరానని చెప్పేవారు. ఆ మాటలు నాలో పట్టుదలను పెంచాయి. ఎలాగైనా సరే సినీ రంగంలో రాణించాలనుకున్నా. ప్రతి రోజు కొత్త విషయాలను తెలుసుకుంటూ నా నటనను మెరుగుపరచుకున్నా. వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఈ స్థాయికి వచ్చాను. నన్ను తిరస్కరించిన వారికి కృతజ్ఞతలు చెప్పాలి. వారి వల్లే మరింత పట్టుదలతో కెరీర్‌ను తీర్చిదిద్దుకున్నా' అని మృణాల్ ఠాకూర్ చెప్పింది. పాత్రలో పరకాయ ప్రవేశం చేసినప్పుడు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటామని, 'సీతా రామం' చిత్రంలో సీతామహాలక్ష్మి పాత్రను ప్రాణం పెట్టి చేశానని, అందుకే ఆ క్యారెక్టర్ ఇప్పటికీ గుర్తుండిపోయిందని ఈ భామ చెప్పుకొచ్చింది. ఆమె విజయ్ దేవరకొండ సరసన నటించిన తాజా చిత్రం 'ఫ్యామిలీ స్టార్' ఇటీవలే ప్రేక్షకుల ముందు కొచ్చింది.

హరీశ్‌శంకర్ దర్శకత్వంలో?

బాబీ తర్వాత బాలయ్యను డైరెక్ట్ చేసే దర్శకుడెవరు? ఈ ప్రశ్నకు రకరకాల సమాధానాలు ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నాయి. కొందరు బోయపాటి 'అఖండ 2' అంటారు. మరికొందరు మలినేని గోపీచంద్ అంటున్నారు. ఇప్పుడు మూడో పేరు కూడా బలంగా వినిపిస్తుంది. ఆ పేరు ఎవరిదో కాదు. మాస్ సినిమాల దర్శకుడు హరీశ్‌శంకర్‌దే. త్వరలో తను బాలయ్యను డైరెక్ట్ చేయనున్నారట. ఫిల్మ్ వర్గాల సమాచారం ప్రకారం 'అఖండ-2' కంటే ముందే హరీశ్‌శంకర్ సినిమా ఉంటుందని తెలుస్తున్నది. ప్రస్తుతం హరీశ్‌శంకర్ అటు పవన్‌కల్యాణ్‌తో 'ఉస్తాద్ భగత్‌సింగ్', ఇటు రవితేజతో 'మిస్టర్ బచ్చన్' సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నారు. బాబీ సినిమాకు బ్రేక్ ఇచ్చి పొలిటికల్ ప్రచారంలో బాలయ్య బిజీగా ఉన్నారు. ఎన్నికల వేడి తగ్గాక, 'బాబీ' సినిమా షూటింగ్‌లోకి ఎంటర్ అవుతారు బాలకృష్ణ. ఆ సినిమా పూర్తి చేసిన తర్వాత హరీశ్‌శంకర్ సినిమా మొదలవుతుందని తెలుస్తున్నది. ఇటీవలే బాలకృష్ణకి హరీశ్‌శంకర్ ఓ కథ వినిపించారని, బాలయ్య సూచనల మేరకు కథలో చిన్నచిన్న మార్పులు చేసే పనిలో హరీశ్‌శంకర్ ఉన్నారని విశ్వసనీయ సమాచారం. మిరపకాయ్, గబ్బర్‌సింగ్, సుబ్రమణ్యం ఫర్ సేల్, గద్దలకొండ గణేశ్ వంటి బ్లాక్‌బాస్టర్స్ అందించిన హరీశ్‌శంకర్.. బాలయ్యతో ఎలాంటి సినిమా చేస్తాడు? అనేది అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్న ప్రశ్న. ఈ విషయంపై పూర్తి వివరాలు తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

వెంటాడే 'శబ్దం'

ఆది పినిశెట్టి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'శబ్దం'. అరివళగన్ దర్శకత్వం వహిస్తున్నారు. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను అగ్ర హీరో వెంకటేష్ ఆవిష్కరించారు. ఓ హాంటెడ్ హౌస్ వద్ద హీరో ఆది పినిశెట్టికి కొన్ని వింత సంఘటనలు ఎదురుకావడం, అక్కడ కొన్ని విచిత్రమైన శబ్దాలను ఆయన రికార్డు చేయడం.. వంటి సన్నివేశాలతో టీజర్ ఆద్యంతం ఉత్కంఠను పంచింది. టీజర్‌లో చిత్ర ప్రధాన తారాగణం మొత్తాన్ని చూపించారు. 'ఈ సినిమా కోసం 120 ఏళ్ల నాటి లైబ్రరీని నిర్మించాం. యూనిక్ కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. సాంకేతికంగా కూడా ఉన్నత ప్రమాణాలతో ఉంటుంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: అరుణ్ పద్మనాభన్, సంగీతం: తమన్ ఎస్, నిర్మాత: సెవెన్ జీ శివ, రచన-లైన్ ప్రొడ్యూసర్-దర్శకత్వం: అరివళగన్.

కార్తికేయ గుమ్మకొండ హీరోగా నటిస్తున్న చిత్రం 'భజే వాయు వేగం'. ప్రశాంత్ రెడ్డి దర్శకుడు. యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను అగ్ర హీరో మహేష్‌బాబు సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో హీరో కార్తికేయ క్రికెట్ బ్యాట్ పట్టుకొని పరుగులు తీస్తూ కనిపిస్తున్నారు. 'వినూత్నమైన కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. కార్తికేయ గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. కథ, కథనాలు చాలా కొత్తగా ఉంటాయి' అని చిత్రబృందం పేర్కొంది. ఐశ్వర్యమీనన్, రాహుల్ టైసన్, తనికెళ్ల భరణి, రవిశంకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఆర్.డి.రాజశేఖర్, సంగీతం: రథన్, దర్శకత్వం: ప్రశాంత్ రెడ్డి.

బిడ్డ బతుకు కోసం..

'తెలుగులో తొలిసారి ఫిమేల్ ఓరియెంటెడ్ సినిమా చేశా. లీడ్ రోల్ చేశాను కనుక కథ నాకు తెలుసు. కథలోని ఆసక్తికర సన్నివేశాలను, మలుపులను లైట్‌గా టచ్ చేస్తూ ట్రైలర్ రూపొందించారు. ట్రైలర్ నాకు నచ్చింది. నిర్మాతగా తొలి ప్రాజెక్ట్ ఫిమేల్ ఓరియెంటెడ్ సబ్జెక్ట్ ఎంచుకొని, బడ్జెట్ ఎక్కువ అవుతున్నా ఏ మాత్రం రాజీపడకుండా, వేరే ఆలోచన చేయకుండా పాషన్‌తో సినిమాను నిర్మించిన మహేంద్ర నాథ్ కూడ్లగారికి నా ధన్యవాదాలు. నిజంగా ఇది వండర్‌ఫుల్ స్క్రిప్ట్. తన బిడ్డను కాపాడుకోడానికి తల్లి ఏం చేసిందనేది ఈ సినిమా కథ. మంచి కంటెంట్ ఉన్న సినిమాలను జనం ఆదరిస్తున్నారు. నా గత చిత్రం 'హను-మాన్' మాదిరిగానే ఈ సినిమాను కూడా ఆడియన్స్ ఆదరిస్తారని, నిర్మాతకు ఈ సినిమా మంచి లాభాలు తీసుకురావాలని ఆశిస్తున్నాను' అని వరలక్ష్మీ శరత్‌కుమార్ అన్నారు. ఆమె ప్రధానపాత్ర పోషించిన చిత్రం 'శబరి'. అనిల్ కట్జ్ దర్శకుడు. మహేంద్రన్ కూండ్ల నిర్మాత. మే 3న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ని శుక్రవారం ఐదు భాషల్లో విడుదల చేశారు. హీరో వరుణ్‌సందేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ట్రైలర్‌ను లాంచ్ చేసి, చిత్రయూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. నిర్మాత శ్రేయస్సు గురించి ఆలోచించే గొప్ప సంస్కారమున్న నటి వరలక్ష్మీశరత్‌కుమార్ అని, ఆమె నటనే ఈ సినిమాకు ప్రధాన బలమని నిర్మాత చెప్పారు. ఇంకా అమరదీప్, నటుడు ప్రభు కూడా మాట్లాడారు.

రాజ్‌తరుణ్ క్రైమ్ కామెడీ

రాజ్‌తరుణ్, రాశీసింగ్ జంటగా నటిస్తున్న తాజా చిత్రం శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రమేష్ కడుములు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని మురళీధర్ రెడ్డి, కేబటిఎన్ శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు మారుతి క్లాప్‌నివ్వగా, ప్రవీణ్ సత్తారు కెమెరా స్విచాన్ చేశారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఇది క్రైమ్ కామెడీ కథాంశం. స్వామిరారా, అంధాధున్ తరహాలో ఉంటుంది. ఈ నెల 15నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలవుతుంది' అన్నారు. తన ఫేవరేట్ జోనర్ అయిన క్రైమ్ కామెడీ కథాంశంతో సినిమా చేయడం ఆనందంగా ఉందని రాజ్ తరుణ్ చెప్పారు. ఈ చిత్రానికి కెమెరా: ఆదిత్య జవ్వాడి, సంగీతం: శేఖర్ చంద్ర, రచన-దర్శకత్వం: రమేష్ కడుముల.

అపహరించడం ఓ కళ

చైతన్యరావు, సునీల్, శ్రద్ధాదాస్, మాళవిక సతీశన్ ప్రధానపాత్రధారులుగా రూపొందుతోన్న క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'పారిజాతపర్వం'. 'కిడ్నాప్ ఈజ్ ఏన్ ఆర్ట్' అనేది ఉపశీర్షిక. సంతోశ్ కంభంపాటి దర్శకుడు. మహీధర్ రెడ్డి, దేవేశ్ నిర్మాతలు. ప్రచారంలో భాగంగా ఈ చిత్రం ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. స్టార్ యాంకర్ సుమ కనకాల ఈ ట్రైలర్‌ని లాంచ్ చేసి యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'కేక్ కట్ చేసేటప్పుడు లైట్స్ ఆర్పుతారట.. మళ్లీ లైట్స్ వేసేలోపు కేక్‌తోపాటు వాళ్ల ఆవిడ కూడా మన బండిలో ఉండాలి' అని సునీల్ తన గ్యాంగ్‌తో కిడ్నాప్ ప్లాన్ చెబుతుండగా ట్రైలర్ మొదలైంది. ట్రైలర్‌లోని ప్రధానపాత్రల చుట్టూ నడిపిన కిడ్నాప్ సీక్వెన్స్‌లు సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయని, యాక్షన్, కిడ్నాప్ డ్రామా, ఫన్ ఇలా అన్నీ ఎలిమెంట్స్‌తో సినిమా అలరిస్తుందని, సాంకేతికంగా అన్ని విభాగాలూ ఆకట్టుకుంటాయని మేకర్స్ చెబుతున్నారు. ఈ నెల 19న విడుదల కానున్న ఈ చిత్రంలో వైవా హర్ష, శ్రీకాంత్ అయ్యంగార్, సురేశ్‌వాణి, సమీర్, గుండు సుదర్శన్, తోటపల్లి మధు ఇత